రామలింగాచారికి సత్కారం



సత్కరిస్తున్న తెలంగాణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: శ్రీరాముని పాదుకలను తాకడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రతినిధులు అన్నారు. అయోధ్యలోని శ్రీరాముని మందిరం కోసం శ్రీరాముడి బంగారు పాదుకలను తయారు చేసిన బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగాచారిని రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రతినిధులు బోయినపల్లిలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి, కార్యదర్శి రాగి ఫణి సతీష్‌కుమార్ చారి, పోతులూరి చారి, సంతోష్ చారి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు పడుతుందో?

- పనులు ప్రారంభమై మూడేళ్లు
- మట్టి కట్ట నిర్మాణంతోనే సరి
- సరూర్‌నగర్ చెరువు వద్ద పూర్తికాని వాకింగ్ ట్రాక్ పనులు
- త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి



చెత్తతో నిండిపోతున్న వాకింగ్ ట్రాక్

చైతన్యపురి: మినీ ట్యాంక్ బండ్‌గా ప్రసిద్ధి పొందిన సరూర్‌నగర్ చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మిషన్ కాకతీయ ఫేజ్–4లో భాగంగా రూ 9.5 కోట్ల వ్యయంతో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 2020 జూన్ నెలలో ఈ పనులు ప్రారంభించారు. వాకింగ్ ట్రాక్ కోసం చెరువు చుట్టూ మట్టి పోసి కట్ట ఏర్పాటు చేసి వదిలేశారు. మిగిలిన పనులు చేపట్టక పోవటంతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తవుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- చెరువు చుట్టూ గోద్రేజ్ హోం నుంచి తపోవన్ కాలనీ వరకు 6.5 మీటర్ల వెడల్పుతో సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాక్ నిర్మించేందుకు 2020 జూన్ నెలలో చేపట్టిన ఈ పనులు 2021 జూన్‌లోగా పూర్తి కావాల్సి ఉంది. అయితే, నాలుగేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తి కాలేదు.
- ట్రాక్ నిర్మాణం కోసం అధికారులు కేవలం చెరువు చుట్టూ మట్టిపోయించి కట్ట ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ కట్టపై కొందరు చెత్త వేస్తుండటంతో కళావిహీనంగా మారింది.
- సరూర్‌నగర్ చెరువులోకి వివిధ కాలనీల నుంచి వచ్చే వరదనీరు మళ్లించేందుకు స్ట్రామ్ నాలా డెవలప్‌మెంట ప్రోగ్రాం కింది(ఎస్ఎన్‌డీపీ) కింద రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ట్రంక్‌లైన్ పనుల్లో జాప్యం జరుగుతోందని, ఈ నేపథ్యంలోనే వాకింగ్ ట్రాక్ పనుల్లోనూ ఆలస్యమవుతోందని అధికారులు అప్పట్లో చెప్పారు.
- ఇంకొన్ని రోజులైతే పూర్తిగా చెత్తతో నిండిపోయి వాకింగ్ ట్రాక్ కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.
- పనులను పూర్తి చేసి వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తేవడంతో దాని చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం చొరవ చూపాలి



సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ చుట్టూ ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు ఎందుకు ఆలస్యం అవుతుందో అర్థం కావటం లేదు. పనులు ప్రారంభించినప్పటి నుంచీ నత్తనడకనే సాగుతున్నాయి. ట్రాక్ నిర్మాణం పూర్తయితే మార్నింగ్ వాక్ చేసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కొత్త ప్రభుత్వం అయినా చొరవ తీసుకుని వాకింగ్ ట్రాక్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– ఆర్.రాజమోహన్‌రాజు, దిల్‌సుఖ్‌నగర్

సుధాకర్‌రెడ్డి మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను అభినందిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు

ఎల్‌బీనగర్: సుధాకర్‌రెడ్డి మెమోరియల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ టోర్నమెంట్ బీఎన్‌రెడ్డినగర్‌లోని అకాడమీలో శుక్రవారం ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు ముఖ్యఅతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ, సుధాకర్‌రెడ్డి ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్‌గా భారత దేశం గర్వపడేలా తెలంగాణ నుంచి బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారు చేశారన్నారు. ఈ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు దేశంలోనే కాకుండా ఇంటర్నేషనల్ స్థాయిలో ఖ్యాతి పొందారని తెలిపారు. సుధాకర్‌రెడ్డి సతీమణి డాక్టర్ సావిత్రి టోర్నమెంట్‌ను నిర్వహించడంపై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ బాబు, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి వంశీ, రవికుమార్, కిషోర్, వివిధ ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య అభ్యసనకు మార్గదర్శనం అవసరం



ప్రసంగిస్తున్న మాతృశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు

సైదాబాద్: ఇంజినీరింగ్ విద్య అనంతరం ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు చక్కటి మార్గదర్శనం ఎంతో అవసరమని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు అన్నారు. శుక్రవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ కాలనీలోని కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల కోసం కళాశాల ఆధ్వర్యంలో ఉన్నతి హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024 నిర్వహించారు. ఇందులో మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల, ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ, ఉన్నత విద్య అభ్యసించడానికి వెళ్లే విద్యార్థులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓవర్‌సీస్‌లో చదువాలనుకునే వారికి, అందుకుగానూ రాయవల్సిన పోటీ పరీక్షల విషయంలో విద్యార్థులకు చక్కటి సూచనలు చేసే ఉద్దేశంతో ఈ ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన 20 మంది నిపుణులు విద్యార్థుల సందేహాలు, అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేపీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, హెచ్ఓడీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 40, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 52, బీర 45, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 45, కేరెట్ 40, దొండ 35–40, చిక్కుడు 28–55, గోకర 45, బీట్‌రూట్ 20, క్యాప్సికం 65, ఆలు 21–25, దోస 28, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 55. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రోడ్డు పరిశీలన

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి శుక్రవారం పర్యటించారు. బుధవారం ఎర్రకుంట చౌరస్తాలో గోతులమయమైన రోడ్డు కారణంగా ఓ యువకుడు మృతి చెందిన నేపథ్యంలో ఆయన రహదారిని పరిశీలించారు. అనంతరం సమీపంలోని బస్తీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎర్రకుంటలో రోడ్డు డ్యామేజీకి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ జహంగీర్, సాదిక్ మహ్మద్, అహ్మద్ బామ్, బారీ, అబ్దుల్లా బిన్ పాల్గొన్నారు.

7న ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: శ్రీ ప్రసన్నాంజనేయ చారిటబుల్ క్లినిక్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హర్రాస్ పెంటలోని ఆలయ ప్రాంగణంలో మహిళా వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హర్రాస్ పెంట హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు వైద్య శిబిరాన్ని అంబేడ్కర్ కళాశాల చైర్మన్ సరోజ వివేక్, రచయిత్రి రాధికాకృష్ణ హాజరవుతారని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజల భాగస్వామ్యంతోనే పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనులలో నాణ్యతాప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సాయిప్రకాశ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని, సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సాయిప్రకాశ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు ప్రవీన్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాచంద్రనాయక్, మోహన్‌పటేల్, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల గడువు పెంచాలి



ఏఐఎఫ్‌బీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాములు యాదవ్ తదితరులు

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల గడువును పెంచాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాములు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్–2024ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలు సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అర్హులుగా ఉన్నారని, వీరంతా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకునేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరారు. అదే విధంగా రైతుబంధు ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డులు లేకున్నా అర్హులకు ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్డు లేని కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు శివలింగం, మల్లేష్ యాదవ్, దార్ల రాజు స్వామి, సిద్ధు, భీమ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

సత్యనగర్‌లోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



సత్యనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలోని డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. శుక్రవారం సత్యనగర్ కాలనీ పోచమ్మ ఆలయం వద్ద నిలిచిన డ్రైనేజీ నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, చాలా రోజులుగా సత్యనగర్ కాలనీలోని పోచమ్మ ఆలయం సమీపంలో డ్రైనేజీ పొంగిపొర్లడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతకాలం క్రితం జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టి సగంలోనే పనులను నిలిపివేయడంతో డ్రైనేజీ నీళ్లు నిలిచిపోయి అపార్ట్‌మెంట్‌లోకి వస్తున్నాయన్నారు. జీఎం బలరాంతో మాట్లాడి సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరగా, స్పందించిన జీఎం వెంటనే మరమ్మతు పనులు చేపట్టి, మురుగు నిలిచిపోకుండా చేస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శుక్లా గారు, రవీందర్, రవీందర్ రావు, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



భాష్యం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు చదువులో రాణించాలని ఇస్రో సైంటిస్ట్ శివశంకర్ అన్నారు. ఆర్‌కేపురంలో భాష్యం హైస్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. కార్యక్రమాని ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివశంకర్ మాట్లాడుతూ, చంద్రయాన్–2 విశేషాల గురించి తెలియజేశారు. చంద్రయాన్–1ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నంత స్థానానికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రముఖ ఇంద్రజాలికుడు రామ్ అఖిల్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రస్తుతం మొబైల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం తన ఇంద్రజాల విద్యతో అందరినీ అబ్బురపర్చారు. పాఠశాల జెడ్ఈఓ అంకమ్మరావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువులో బాగా రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకుట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు, లిటిల్ చామ్స్ ప్రిన్సిపాల్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిందాదేవి తిరునక్షత్రం



తిరునక్షత్రం సందర్భంగా అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: ధనుర్మాస మహోత్సవ తిరుప్పావై ప్రవచనోత్సవాలలో భాగంగా శుక్రవారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిందాదేవి విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. అప్పన్ కందాడై పెరుమళ్ళాచార్య స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రిందాశరణ్య నాట్యమండలి యశోదా బృందం నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రామకృష్ణ, రూపాదేవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య అక్షింతల పంపిణీ



వినాయక్‌నగర్‌లో శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నర్సింహారెడ్డి తదితరులు



అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న భాగ్యలక్ష్మి, సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో శుక్రవారం సాయంత్రం అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, చలన చిత్ర సలహా మండలి సభ్యుడు జక్కా మోహన్‌రెడ్డిలు మేళ తాళాలు, సంకీర్తనల నడుమ అక్షింతల ఊరేగింపునకు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల దినేష్, కొండారెడ్డి, దత్తు, మంగళ, శివలక్ష్మి, దుర్గ, భారతి, సందీప్, మల్లేష్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ అందజేస్తాం: కొప్పుల

మన్సూరాబాద్: అయోధ్య శ్రీరాముని అక్షింతలు డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికీ అందజేస్తామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ అందజేస్తున్న శ్రీరాముని అక్షింతలను కాలనీలవాసులు ఎంతో భక్తితో తీసుకుంటున్నారన్నారు. అక్షింతలు అందని వారు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఆర్ఎస్ఎస్ నేతలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్‌కేపురం డివిజన్‌లో ముదిరాజ్‌ల కోసం సంక్షేమ భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ఎల్ఎం ముదిరాజ్, పులకరం శ్రీనయ్య ముదిరాజ్, వెంకటేష్, బండారు మల్లేష్ ముదిరాజ్, వెంకటేష్, ఎన్టీఆర్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పేరిట రోడ్లు ఛిద్రం

- పైప్‌లైన్ల కోసం రోడ్ల తవ్వకాలు
- పని పూర్తయ్యాక మరమ్మతు చేపట్టని కాంట్రాక్టర్లు
- అస్తవ్యస్తంగా మారిన రోడ్లపై రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సాయివిహార్‌నగర్ కాలనీలో రోడ్డును తవ్వి శిథిలాలను ఇళ్ల ముందే వదిలేసిన వైనం

మీర్‌పేట: అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను యథేచ్ఛగా తవ్వేయడం.. ఆపై మరమ్మతులు చేయకుండా వదిలేయడం.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో షరా మామూలైంది. కాసులు దండుకోవడానికే అధిక ప్రాధాన్యం ఇచ్చే కాంట్రాక్టర్లు తూతు మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణాకు అనుకూలమైన రహదారులు సైతం పైప్‌లైన్ పేరుతో ఛిద్రం చేసి స్థానికులను అవస్థలకు గురిచేస్తున్నారు. అభివృద్ధి అంటే ఉన్న మంచి పనిని తొలగించి మరలా నిర్మించడం లాంటి అలవిమాలిన చర్యలు కాకుండా పకడ్బందీ కార్యాచరణతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను తీర్చాలి.

డ్రైనేజీ ఏర్పాటుకు..

పలు కాలనీలలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం అంతర్గత రహదారులను తవ్వి పనులు పూర్తయ్యాక మరమ్మతులు చేపట్టకుండా కాంట్రాక్టర్ మట్టితో పూడ్చి చేతులు దులుపుకొంటున్నారు. అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్లను అడ్డగోలుగా తవ్వడంతో ధ్వంసమై గుంతలమయంగా మారాయి. అంతర్గత రహదారులను తవ్విన తరువాత పనులు చేసిన సదరు కాంట్రాక్టరే తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే కాలనీల దారులన్నీ అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఎస్ఎల్ఎన్ఎస్, సాయివిహార్‌నగర్ తదితర కాలనీల్లో రహదారులు సరిగా లేక వాహనాదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ప్రయాణం నరకం..

ముఖ్యంగా రోడ్ల తవ్వకాలతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి రావడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తమైన రహదారుల గుండా ప్రయాణం చేయడానికి నరకయాతన పడుతున్నారు. కొన్నిచోట్ల ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేగాకుండా రోడ్డు శిథిలాలను కూడా తొలగించకుండా ఇళ్ల ముందే ఉంచారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధి పనుల నిమిత్తం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

దుమ్ముతో అవస్థలు పడుతున్నాం



దాదాపు నెలన్నర రోజుల క్రితం పైపులైన్ కోసం రోడ్డును తవ్వారు. మంచిగా ఉన్న రోడ్డును తవ్వి మరమ్మతులు చేయకపోవడంతో ధ్వంసమైంది. దీంతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తోంది. వీలైనంత త్వరగా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.

– జిల్లెల సత్యేశ్వరం, డైమండ్‌కాలనీ, మీర్‌పేట

ఆలయ భవనం స్వాధీనం

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణ భవనంలో అక్రమంగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తిని గ్రామస్తుల సహకారంతో దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం ఖాళీ చేయించారు. తనకు తానే స్వామీజీగా చెప్పకుంటున్న స్థానికేతరుడైన వ్యక్తి కొన్నాళ్లుగా దేవాలయం పక్కన ఉన్న పూజారులకు కేటాయించిన ఇంట్లో ఉంటున్నాడు. ఆలయ అర్చకులు ఉండేందుకు నివాస భవనం లేకపోవడంతో వారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లిలో అద్దెకు నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన దేవాదాయ అధికారులు పలుమార్లు అతన్ని ఇల్లు ఖాళీ చేయాలని సూచించారు. అయినప్పటికీ అతడు వినకపోవడంతో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో మురళీకృష్ణలు పాలక మండలి చైర్మన్ వెంకటేష్, సభ్యులు పద్మశంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ సభ్యులు సురేష్, శ్రీకాంత్, విఘ్నేష్, మహేందర్ గౌడ్‌లు, గ్రామ భక్తుల పర్యవేక్షణలో సదరు వ్యక్తికి సంబంధించిన సామగ్రిని తొలగించారు. అనంతరం అధికారులు ఆ ఇంటికి తాళం వేసి సీల్ వేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున రావడంతో విషయం తెలుసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ఉద్యమకారులకు రూ. 25 వేల పింఛన్ ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వారికి రూ. 25 వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్.యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా వెంకటరమణ

చాదర్‌ఘాట్: తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌కు చెందిన వ్యాపారవేత్త చేగూరి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కెట్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వ్యాపారులు ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ, వ్యాపారస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో దేవర రాజేశ్వర్, వంజరి వినోద్‌కుమార్, రమేష్ గుప్తా పాల్గొన్నారు.